

విజయమ్మకు ఘన స్వాగతం

దివంగత వైఎస్సార్ సతీమణి విజయమ్మకు పాలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. 8లో



శివాలయాల ముస్తాబు

మహా శివరాత్రికి జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. కొన్ని ఆలయాల్లో నేడే వేడుకలు ప్రారంభమవుతున్నాయి. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
36° / 19°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. తెల్లవారు జామున, రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవోపేతంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

చెస్ పోటీలకు విశేష స్పందన



చెస్ పోటీల్లో తలపడుతున్న మహిళలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి మహిళా చెస్ పోటీలకు విశేష స్పందన లభించిందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ ఆదేశాల మేరకు సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మహిళలకు చెస్ పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో 30 టీమ్‌లు పాల్గొనగా, మొదటి స్థానం అద్విత, రెండో స్థానం ఎండీ.సుమాయ్ సాధించారని తెలిపారు. వీరిద్దరూ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీడల శాఖ సిబ్బంది బి.తిరుమలరావు, లక్ష్మయ్య, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సాంబశివరావు, సెక్రెటరీ సెల్లా తదితరులు పాల్గొన్నారు.

లైట్ హౌస్ గ్రామ పంచాయతీలుగా ఎంపిక

అశ్వాపురం/చుంచుపల్లి : జాతీయ స్థాయిలో 75 గ్రామ పంచాయతీలను లైట్ హౌస్ జీపీలుగా ఎంపిక చేయగా అందులో జిల్లాలోని నాలుగు పంచాయతీలు ఉన్నాయి. వీటిలో బూర్గంపాడు మండలం ఇరవెండి, మోరంపల్లి బంజర, అశ్వాపురం మండలంలోని మొండికుంట, రామచంద్రాపురం పంచాయతీలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఐటీసీ సహకారంతో ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు ఉమ్మడిగా పారిశుద్ధ్య ప్రణాళికలు రూపొందించుకుని ప్రభుత్వానికి పంపిస్తారు. మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడుగుంతలు, తడి, పొడి చెత్త వేరుచేయడం వంటి కార్యక్రమాలపై అవగాహన పెంచనున్నారు. ఈ సందర్భంగా మొండికుంట, రామచంద్రాపురం పంచాయతీలలో గ్రామస్థాయి అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ లీడర్లకు మొండికుంట పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎస్‌బీఎం, ఐటీసీ ఎంఎస్‌కే వాష్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం జిల్లా ఐఈసీ కో ఆర్డినేటర్ రేవతి, బూర్గంపాడు ఎంపీఓలు శ్రీనివాస్, సునిల్, ఈసీ సందీప్, ఐటీసీ నుంచి సందీప్, వెంకట్రావు, రాజ్‌కుమార్, వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు మర్రి మల్లారెడ్డి, కాక అశోక్, ఉపసర్పంచ్ సుధీర్, పంచాయతీ కార్యదర్శి సైదులు పాల్గొన్నారు.

●అవిశ్వాసం ఎఫెక్ట్

బెల్ట్‌పై దెబ్బ!



ఆ పట్టణమే కీలకం..

ఏడు ఏజెన్సీ మండలాలకు ఆ పట్టణం కేంద్రంగా ఉంది. ఈ మండలాలకు చెందిన ప్రజలు పప్పు, ఉప్పు, ఎరువులే కాదు.. ఆఖరికి బెల్ట్‌షాపులకు మద్యం సరఫరాకు కూడా ఈ పట్టణమే కీలకం. ఇక్కడ మద్యం సిండికేట్‌లో కీలకంగా ఉంటూనే ఆ వ్యక్తి రాజకీయాల్లోనూ రాణిస్తున్నాడు. ఇటీవల అవిశ్వాసంలో కీలక భూమిక అతనిదే. అసంతృప్తులకు ఆర్థికంగా అండగా ఉండటమే కాకుండా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గకుండా అసంతృప్తి చల్లారకుండా జాగ్రత్త పడుతున్నాడు. అవినీతికి పాల్పడుతున్న తమ బాస్‌ను గద్దె దించే వరకూ పోరాటం ఆగదంటూ వరుస ప్రకటనలు ఇస్తూ వచ్చాడు. దీంతో సదరు రాజకీయ నేతకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉన్న మద్యం సిండికేట్ పునాదులు కదిలించే పనిలో అక్కడి అధికార పార్టీ నేతలు పావులు కదిపారు.

అసంతృప్తుల ఆర్థిక మూలాలపై ఎటాక్

- లిక్కర్ సిండికేట్ లక్ష్యంగా మొదలైన దాడులు
- బెల్ట్‌షాపుల తాట తీస్తున్న ఎక్సైజ్ శాఖ
- పది రోజుల్లో ఆ ప్రాంతంలో క్లీన్‌స్వీప్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: చాప కింద నీరులా ప్రతీ పల్లెకు, గల్లీ గల్లీకి పాకి జన జీవితంలో ఇబ్బందులు సృష్టిస్తున్న బెల్ట్‌షాపుల సమస్యకు అనుకోకుండా పరిష్కారం దొరికింది. ఇటీవల తెర పైకి వచ్చిన అవిశ్వాస తీర్మానాలు, తదనంతర పరిణామాలు ఇందుకు బీజం వేశాయి. ఫలితంగా ఇన్నాళ్ల విధి నిర్వహణలో బెల్ట్‌షాపులను చూసీ చూడనట్టుగా వదిలేసిన ఎక్సైజ్ శాఖ, తాజా రాజకీయ ఒత్తిళ్లతో ఒక్కసారిగా తమ ప్రతాపం చూపించడం ప్రారంభించింది.

రాజకీయ పాచికలు..

సంక్రాంతి పండుగ ముగిసింది మొదలు జిల్లాలో స్థానిక సంస్థల్లో అసంతృప్తి ఒక్కసారిగా భగ్గుమంది. తమ మాట వినని నాయకులను గద్దెదిగాలంటూ అసమ్మతివాదులంతా ఏకమై గళం విప్పడం మొదలెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని కార్యాచరణను మథించే పనిలో పడ్డారు. మరికొందరు అవిశ్వాస తీర్మాన పత్రంపై సంతకాలు పెట్టి జిల్లా అధికారులకు అందజేశారు. అనంతరం క్యాంపులకు బయలుదేరి వెళ్లారు. కాగా, అవిశ్వాస తీర్మానాలు, అసంతృప్తులు ఇంత బలంగా వినిపించడానికి కొందరు వ్యక్తులే కారణమని అధికార పార్టీ నేతలు గుర్తించారు. ముందుగా మాటలతో సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. సానుకూల ఫలితం రాకపోవడంతో ఇప్పుడు అసంతృప్తుల ఆర్థిక మూలాలను దెబ్బకొట్టే పనిలో పడ్డారు.

పది రోజులుగా నో బెల్ట్..

గత పది రోజులుగా సదరు రాజకీయ నేత ఆధీనంలో ఉన్న లిక్కర్ సిండికేట్ నుంచి ఒక్క క్వార్టర్ సీసా కూడా బెల్ట్‌షాపులకు సరఫరా కావడం లేదు. పై నుంచి వచ్చిన ఆదేశాలతో అలర్ట్ అయిన ఎక్సైజ్ అధికారులు ప్రతీ బెల్ట్‌షాపునకు వెళ్లి వార్నింగులు ఇచ్చారు. ఇప్పటిదాకా ఒక లెక్క... ఇకపై మరో లెక్క అంటూ అల్టిమేటం జారీ చేశారు. కాదని ఎక్కడైనా కన్నుగప్పి ఒకటో, రెండో పెగ్గులు అమ్మినట్టు తెలిస్తే చాలు వెంటనే ఆ బెల్ట్‌షాపుపై వాలి కేసులు నమోదు చేస్తున్నారు. సిండికేట్ ఆధ్వర్యంలో ఉన్న వైన్‌షాపుల్లో అమ్మకాలపై నిరంతర నిఘా పెట్టారు. సీసీ కెమెరాలను మించి ఎక్సైజ్ కానిస్టేబుళ్లు అక్కడ కాపాలా ఉంటున్నారు. ఎవరైనా పెద్ద మొత్తంలో ఆల్కహాల్ కొనేందుకు ప్రయత్నిస్తే పట్టేస్తున్నారు. ఇలా గత పది రోజులుగా ఆ పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలు, గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో చుక్క ఆల్కహాల్ దొరకని పరిస్థితి నెలకొంది.

నేరుగా ఆటోల్లో..

గతంలో అంతా భాయీ భాయిగా ఉన్నప్పుడు బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగేవి. సిండికేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆటోల్లో మద్యం కేసులు, లిక్కర్ బాటిళ్లు బెల్ట్‌షాపులకు తరలిపోయేవి. రాత్రి పగలు తేడా లేకుండా దర్జాగా ఈ దందా సాగేది. క్వార్టర్ బాటిల్‌పై రూ.15, బీర్ బాటిల్‌పై రూ.20 నుంచి 50 వరకు అదనంగా వసూలు చేసేవారు. ఈ బెల్ట్‌షాపుల బారిన పడి అల్పాదాయ వర్గాల కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారేది. బెల్ట్ మహమ్మారిని అరికట్టాలంటూ ప్రజా సంఘాలు చేసిన వినతులు గాలికి కొట్టుకుపోయాయి. కానీ రాజకీయ ఎత్తుగడల్లో భాగంగా ఎవరూ ఊహించని విధంగా కేవలం పది రోజుల్లోనే ఆ ప్రాంతంలో బెల్ట్‌షాపులు క్లీన్‌స్వీప్ అయ్యాయి. ఈ అవిశ్వాసం వేడి చల్లారినా బెల్ట్‌షాపులకు మళ్లీ అవకాశం ఇవ్వొద్దంటూ అక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.

‘పుష్కర’ పనులకు శ్రీకారం

తాత్కాలిక యాగశాల నిర్మాణానికి పూజలు



యాగశాల నిర్మాణం సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 22 నుంచి 31 వరకు ‘పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక ప్రయుక్త ద్వాదశ కుండాత్మక చతుర్వేద సహిత శ్రీరామయణ మహాక్రతువు ఉత్సవాలు జరపనున్నారు. మార్చి 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం రోజున శ్రీరామనవమి క్రతువుకు అంకురార్పణ చేస్తారు. ఈ ఏడాది పుష్కర పట్టాభిషేక మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు నిర్ణయించిన వైదిక కమిటీ, దేవస్థానం అధికారులు.. అందుకు సంబంధించి పనులకు ప్రణాళిక రూపొందించారు. ముందుగానే తాత్కాలిక యాగశాల నిర్మించాలని నిర్ణయించగా, ఈ పనులకు గురువారం భూమి పూజ చేశారు. మాడ వీధుల్లోని ప్రచార రథం షెడ్‌కు ఎదురుగా యాగశాల నిర్మిస్తున్నారు. సామ్రాజ్య పట్టాభిషేకం సందర్భంగా మార్చి 22 నుంచి 31 వరకు నిరంతరం యాగాలు, హోమాలు చేపట్టాలని నిశ్చయించారు. దీనికి గాను మూడు తాత్కాలిక యాగశాలలు, 12 హోమ గుండాలు ఏర్పాటు చేయనున్నారు. దేవస్థాన వైదిక సిబ్బంది, అర్చకులు, వేద పండితులతో పాటు 108 మంది రుత్విక్‌లు 12 రోజుల పాటు పూజల్లో పాల్గొనేలా బాధ్యతలు అప్పగించనున్నారు. పట్టాభిషేక క్రతువు మిథిలా స్టేడియంలోని వేదికపై జరగనుంది. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పనులు ప్రారంభించగా ఆలయ నూతన ఈఓ రమాదేవి, మాజీ ఈఓ బి.శివాజీ, ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, స్థానాచార్యులు స్థలశాయి, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో ప్రధాన అర్చకుడికి స్థానం కల్పించాలి

వైదిక కమిటీలో రెండో ప్రధాన అర్చకుడికి స్థానం కల్పించే అంశంపై కొంత కాలంగా వివాదం నెలకొంది. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఈఓ రమాదేవిని గురువారం ఒక వర్గం అర్చకులు కలిసి వైదిక కమిటీలో రెండో ప్రధాన అర్చకుడికి స్థానం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఇద్దరిలో ఒకరికి మాత్రమే స్థానం కల్పించారని, రెండో ప్రధాన అర్చకుడు విజయరాఘవన్‌కు తక్షణమే స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే పుష్కర సామ్రాజ్య పనులను బహిష్కరిస్తామని తెలిపారు. దీనిపై స్పందించిన ఈఓ వివరాలు తెలుసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈఓగా రమాదేవి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రమాదేవి

శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ నూతన ఈఓగా ఎల్.రమాదేవి పూర్తి అదనపు బాధ్యతలను గురువారం స్వీకరించారు. తొలుత అంతరాలయంలో మూలమూర్తుల వద్ద, ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో బదిలీ అయిన ఈఓ శివాజీ నుంచి బాధ్యతలు చేపట్టారు. అనంతరం రమాదేవికి ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి ‘సాక్షి’తో మాట్లాడుతూ.. వచ్చే నెలలో జరిగే శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలను సమష్టి కృషితో విజయవంతం చేస్తామని చెప్పారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ముందు ఈఓగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సవాల నిర్వహణతో పాటు ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని, రాముడి భూములపై ప్రత్యేక దృష్టి సారించి అన్యాక్రాంతం కాకుండా చూస్తామని తెలిపారు. సాయంత్రం కలెక్టర్ అనుదీప్‌ను మర్యాదపూర్వకంగా నూతన కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేవుడికి సేవ చేసే భాగ్యం రావడం అదృష్టమని అన్నారు. అనుభవం కలిగిన అధికారి ఈఓగా రావడం శుభపరిణామమని అన్నారు.

పెండింగ్ దరఖాస్తులపై విచారణ పూర్తి చేస్తాం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జీఓ 76లో పెండింగ్‌లో ఉన్న 83 దరఖాస్తుల విచారణ ప్రక్రియను సోమవారం నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో కంటివెలుగు, జీఓ 76, 58, 59, 118, తెలంగాణకు హరితహారం, పోడు పట్టాలు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు తదితర అంశాలపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 93 గ్రామ పంచాయతీలు, 36 వార్డుల్లో కంటి వెలుగు క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 34,521 మందికి రీడింగ్ కంటి అద్దాలు పంపిణీ చేశామని, ప్రిస్కిప్షన్ అద్దాలు అవసరమైన వారి వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామని తెలిపారు. జీఓ 76 ప్రకారం ఇంటిస్థలాల క్రమబద్ధీకరణకు 12,948 దరఖాస్తుల విచారణ ప్రక్రియ పూర్తి చేశామని, మిగిలిన 83 దరఖాస్తులు సోమవారం వరకు పూర్తిచేస్తామని చెప్పారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు క్షేత్రస్థాయి విచారణకు టీమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వేసవిలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విచారణ ప్రక్రియ పూర్తయిన పోడు సాగుదారులకు పటాల్ట్లు జారీ చేసేందుకు 44 వేల పాసుపుస్తకాల ముద్రణ ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. జిల్లాలో కంటివెలుగు, పోడు సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సీఎస్ అభినందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఇల్లెందు అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలత పాల్గొన్నారు.

పట్టాలు లేని నిర్మాణాల సమాచారం సేకరించాలి

ఇంటి పట్టాలు పొందకుండా నిర్మించిన గృహాల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. శుక్రవారమే ఈ ప్రక్రియ ప్రారంభించి ఆదివారం నాటికి పూర్తి చేయాలన్నారు. పట్టాలు లేకుండా నిర్మించిన ఏ ఇంటినీ వదలవద్దన్నారు. సర్వే నిర్వహణకు 12 కాలాలతో కూడిన ప్రొఫార్మా అందజేశామని, అందులో పేర్కొన్న విధంగా సమగ్ర సమాచారం సేకరించాలని సూచించారు. ఆస్తి పన్ను నమోదు రిజిస్టర్లను పరిశీలించాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా నివేదిక తయారుచేయాలన్నారు. పాల్వంచ, కొత్తగూడెం మండలాల్లో 624 ‘డబుల్’ ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి: జిల్లాలో ఖాళీగా ఉన్న 11 ఆయుష్ వైద్యాధికారుల (ఆయుర్వేదిక్/యునాని, హోమియోపతి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 23 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. నాలుగు ఆయుర్వేద, నాలుగు యునాని, మూడు హోమియోపతి వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హతలు, అప్లికేషన్ల వివరాలకు http://kothagudem.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

వాహనాల పన్నులు చెల్లించండి

కొత్తగూడెంఅర్బన్: రవాణా శాఖకు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నును మార్చి 31లోపు పూర్తి చేయాలని జిల్లా రవాణా శాఖాధికారి వేణు తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. పన్నుల చెల్లింపునకు రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోందని, జిల్లాలో రూ. 6 కోట్ల పన్ను లు కట్టకుండా 5,700 వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. అందులో 2000 లారీలు, 2,800 ట్రాక్టర్లు, 79 మాక్సీ క్యాబ్‌లు, మిగతావి ఇతర వాహనాలు ఉన్నాయని వివరించారు. ప్రధానంగా క్వారీలో తిరుగుతున్న వాహనాలు ఆరు నెలలుగా పన్నులు చెల్లించడం లేదని, వారు స్వచ్ఛందంగా చెల్లిస్తే పన్నులో 50 శాతం పెనాల్టీ మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ఆయా వాహనాలు తనిఖీలలో పట్టుబడితే 200 శాతం పెనాల్టీ ఉంటుందని, జిల్లాలో నాలుగు ప్రత్యేక బృందాలు ప్రతి రోజు తనిఖీలు నిర్వహిస్తున్నాయని వివరించారు.

‘పది’లో ఉత్తీర్ణత పెంచాలి

డీఈఓ ప్రసాద్



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈఓ

భద్రాచలం: త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ఎస్.ఎస్. ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. బోధన విధానాన్ని పరిశీలించి, విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మాట్లాడుతూ.. గత సంవత్సరం ఈ పాఠశాలలో ఉత్తీర్ణత తక్కువగా వచ్చిందని, ఈ ఏడాది మెరుగైన ఫలితాలు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, రెండు పూటలా స్నాక్స్ అందజేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెనుకబడిన వారిపట్ల మరింత శ్రద్ధగా ఉండాలని సూచించారు. పరీక్షలంటే భయపడే విద్యార్థులకు సైకాలజిస్ట్‌తో తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సమ్మయ్య, సెక్టోరియల్ అధికారి ఎస్‌కే సైదులు, ప్రధానోపాధ్యాయురాలు బి.నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనులకు ‘పట్టా’భిషేకం..

- నిబంధనలు లేకుండానే పోడు పట్టాలు
- జిల్లా కమిటీకి చేరిన 44,120 దరఖాస్తులు
- హక్కు ప్రత్రాలు సిద్ధం చేస్తున్న అధికారులు



పోడు హక్కు ప్రతాలు సిద్ధం చేస్తున్న అధికారులు

చుంచుపల్లి: పోడు పట్టాల జారీలో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు పెద్దపీట వేయబోతోంది. పోడు సాగుపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల నిబంధనల నుంచి ఊరట ఇచ్చినట్టు తెలిసింది. హక్కు పత్రాల జారీలో తాజాగా 2021 వరకు వెలుసుబాటు కల్పించింది. ప్రస్తుతం పోడు సాగులో ఉన్న గిరిజనులందరికీ హక్కుపత్రాలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దీంతో గిరిజనులు అధిక సంఖ్యలో హక్కుపత్రాలు సొంతం చేసుకోనున్నారు. ఇప్పటికే అధికారులు దీనిపై కసరత్తు పూర్తి చేశారు. గిరిజనులు హక్కుపట్టాలు పొందాలంటే చట్ట ప్రకారం 2005 డిసెంబర్ 13కు ముందు పోడు సాగు చేసి ఉండాలి. గిరిజనేతరులైతే మూడు తరాల ఆధారాలు చూపాలి. కానీ తాజా ఆదేశాల మేరకు 2005 తర్వాత పోడు చేసిన దరఖాస్తులపై కూడా అనుమతించారు. 2005 తర్వాతే నాలుగింతల అటవీ భూమి ఆక్రమణకు గురైంది. పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముందుకొచ్చిన ప్రభుత్వం.. అర్హులైన సాగుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వాటిని ప్రత్యేక యాప్‌లో నమోదు చేశాక గ్రామసభలు నిర్వహించి సక్రమంగా లేని 25 శాతం మేర దరఖాస్తులు తిరస్కరించారు. ఆమోదించిన దరఖాస్తులను సబ్‌డివిజనల్ కమిటీకి సిఫార్సు చేయగా, అక్కడా కొన్ని తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత అర్హుల జాబితాను గత నెలలో జిల్లా కమిటీకి పంపించారు.

డీఎల్సీకి చేసిన దరఖాస్తులు 11,532

జిల్లాలో 332 గ్రామ పంచాయతీల పరిధిలో 726 ఆవాస గ్రామాల్లో పోడు భూములు విస్తరించినట్లు అటవీశాఖ గుర్తించింది. 2.97 లక్షల ఎకరాల భూమి సాగుదారుల చేతుల్లో ఉన్నట్టు తేలింది. 2021లో పోడు హక్కు పత్రాల కోసం జిల్లా వ్యాప్తంగా 83,341 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 65,616 గిరిజనులవి, 17,725 గిరిజనేతరులవి ఉన్నాయి. మొదట 2005 డిసెంబర్ 13 ముందు అటవీ నిబంధనల ప్రకారం వివిధ దశల్లో పోడు దరఖాస్తులను పరిశీలించగా 11,532 మంది అర్హులుగా తేలారు.

రెండోసారి కసరత్తులో భారీగా..

తాజాగా రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు 2005 తర్వాత పోడు సాగు చేసిన దరఖాస్తులను కూడా అధికారులు పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఈ ప్రక్రియ దాదాపు వారం రోజుల పాటు సాగింది. పోడు గిరిజన రైతులకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నా, పోడు భూమి సాగులో లేకున్నా, స్థానికంగా ఉండకపోయినా అలాంటి దరఖాస్తులను తిరస్కరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2005 తర్వాత సాగులో ఉన్న గిరిజనులను తిరిగి జాబితాలో చేర్చారు. దీంతో అర్హుల సంఖ్య దాదాపు నాలుగింతలు పెరిగింది. మొత్తంగా జిల్లాలో 44,120 దరఖాస్తులకు రెండు, మూడు రోజుల్లో డీఎల్సీలో ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలుస్తోంది. వీటి పరిధిలో 1.25 లక్షల ఎకరాల సాగు భూములు ఉండగా అన్నింటికీ హక్కు పత్రాలు రానున్నాయి. అయితే జాబితాను ప్రకటించక ముందే వీరందరికీ హక్కు పత్రాలతో పాటు పాస్ పుస్తకాలను ఇప్పటికే సిద్ధం చేసే పనుల్లో ఉన్నారు. పోడు హక్కు పత్రాల జారీలో గిరిజనేతరులతో పాటు గొత్తికోయలను పక్కనపెట్టారు.

హక్కుపత్రాలు సిద్ధం..

జిల్లాలోని తొలిసారి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోడు పట్టాలను పంపిణీ చేశారు. అటవీ హక్కుల చట్టం నిబంధనల మేరకు జిల్లాలో అర్హులైన గిరిజనులకు 2012 వరకు హక్కుపత్రాలు అందజేశారు. మొత్తం 2,03,434 ఎకరాలకు గానూ 49,344 దరఖాస్తులు రాగా అందులో 24,634 దరఖాస్తులకు పోడు హక్కు పట్టాలు ఇచ్చారు. అప్పుడు అత్యధికంగా ఇల్లెందు నియోజకవర్గంలో 10,173 దరఖాస్తులు ఉన్నాయి. ప్రస్తుతం అర్హుల జాబితా అధికారికంగా ప్రకటించకున్నా రెండోసారి కసరత్తు అనంతరం 44,120 దరఖాస్తులకు సంబంధించిన పాస్ పుస్తకాల ముద్రణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అదే విధంగా కొత్తగా పంపిణీ చేయనున్న పోడు హక్కుప్రతాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. ‘వ్యక్తిగత అటవీ హక్కు పత్రం’ పేరుతో లోపల 3 పేజీల పట్టా తయారు చేశారు. ఇందులో నిబంధన 8 హెచ్ ప్రకారం అనే అంశం పొందుపరిచారు. హక్కుప్రతంలో సాగుదారుని పేరు, తండ్రిపేరు, కులం, గ్రామం, మండలం, పోడుసాగు చేసిన ఎకరాలు, సాగుదారుని ఫొటో, సాగుచేస్తున్న భూమి మ్యాప్ వివరాలను పొందుపరిచారు. ఇందులో కలెక్టర్, ఎఫ్‌డీఓ, ఐటీడీఏ పీఓ సంతకాలు ఉంటాయి.

క్లుప్తంగా

హెచ్ఎం, వంట మనిషికి మధ్య ఘర్షణ!

పాఠశాలలో డీఈఓ ప్రసాద్ విచారణ



పాఠశాలలో విచారణ చేస్తున్న డీఈఓ ప్రసాద్

పాల్వంచ: పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, వంట మనిషి లలితకు మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోగా గురువారం డీఈఓ ఎస్ఎస్ఎస్. ప్రసాద్ విచారణ చేపట్టారు. ఇటీవల కాలంలో వంట మనిషి సరిగా వంట చేయడం లేదని ప్రధానోపాధ్యాయురాలు చెబుతుండగా, తమపై కక్షతోనే ఆరోపణలు చేస్తున్నారని వంట మనిషి పేర్కొంటోంది. ఈ క్రమంలో వారి మధ్య గొడవలు జరిగి ఒకరిపై ఒకరు చేయి కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో డీఈఓ ప్రసాద్ పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. వంట ఏజెన్సీ మారుస్తామని హామీ ఇచ్చారు. కాగా హెచ్ఎంపై దాడిని పీఆర్టీయు నాయకులు ఖండించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు కె.సీతారామరాజును సస్పెండ్ చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలోని ఉపాధ్యాయురాలిని లైంగిక వేధింపులకు గురి చేయడంతో, ఆమె బంధువులు పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఎంఈఓ సున్నం సమ్మయ్య విచారణ చేపట్టగా, లైంగిక వేధింపులు వాస్తవమేనని తేలింది. అదే పాఠశాలలో విద్యార్థినుల పట్ల, మధ్యాహ్న భోజన వర్కర్లపై కూడా సదరు ఉపాధ్యాయుడు వేధింపులకు పాల్పడినట్టు తేలడంతో ఎంఈఓ జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. దీంతో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



అధికారులు పట్టుకున్న ట్రాక్టర్

మణుగూరుటౌన్: మండలంలోని గోదావరి తీరం నుంచి రాత్రి వేళ అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ నాగరాజు గురువారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

మధిర: అనుమానం పెంచుకున్న భర్త చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మధిరలో జరుగుతున్న కేబుల్ లైన్ పనుల కోసం మోతె మండలం చంద్రుపట్ల నుంచి కొందరు కూలీలు 15 రోజుల క్రితం రాగా జిలుగుమాడు సమీపాన ఉంటున్నారు. ఈక్రమంలో చంద్రుపట్లకు చెందిన ఓర్సు నాగరాజు, కవిత దంపతులు కూడా చిన్న కుమారుడితో కలిసి వచ్చారు. తన భార్యపై తరచూ గొడవ పడే నాగరాజు ఈనెల 9న కవితపై ఫైబర్ పైపుతో దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కవిత తండ్రి వీరయ్య ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఘటనపై వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి తెలిపారు.

నేడు హైదరాబాద్‌కు అఖిల్ మృతదేహం

మధిర: గన్ మిస్‌ఫైర్ కావడంతో ఈ నెల 6న అమెరికాలో మృతి చెందిన మధిర విద్యార్థి అఖిల్ (శ్రావిక్(సాయి) మృతదేహం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనుంది. ఈ విషయమై కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఆతర్వాత శనివారం ఉదయంకల్లా మధిరకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

పాలడుగులో వరిగడ్డి దగ్ధం

వైరారూరల్: ట్రాక్టర్‌పై వరిగడ్డి తీసుకెళ్తున్న క్రమంలో విద్యుత్ వైర్లు తాకగా గడ్డి దగ్ధమైంది. మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన రైతు కోరే వెంకటేశ్వర్లు గురువారం ట్రాక్టర్‌పై వరిగడ్డి వేసుకుని వెళ్తుండగా పాలడుగులోని పాఠశాల వద్ద విద్యుత్ వైర్లు తాకాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంట అంటుకోవడంతో గడ్డి పూర్తిగా కాలిపోయింది. కాగా, అదే మార్గంలో వెళ్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా ఇచ్చిన సమాచారంతో ఎంపీడీఓ జ్యోత్స్నాదేవి, కార్యదర్శి కుమార్ మంటలు అదుపు చేయించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

శివాలయాల ముస్తాబు..

- శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు
- రేపు మహాశివరాత్రి వేడుకలు



కోటి లింగాల శివాలయం

జాతరకు సిద్ధమైన కోటిలింగాల

ఇల్లెందు: ఇల్లెందు, కారేపల్లి మండలాల సరిహద్దుల్లో ఉన్న, వందల ఏళ్ల చరిత్ర కలిగిన కోటిలింగాలలోని శివాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబవుతోంది. ఇల్లెందు, బయ్యారం, కారేపల్లి మండలాలతో పాటు మహబూబాబాద్, వరంగల్ జిల్లాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారు. ఇక్కడ శివలింగం చుట్టూ జలధార నిత్యం ప్రవహిస్తుండటం ప్రత్యేకత. ఏటా మహా శివరాత్రికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఈ నెల 17,18,19 తేదీల్లో మహాశివరాత్రి సందర్భంగా కోటిలింగాల జాతర సాగుతుంది. 17న రాత్రి శివ పార్వతులు కల్యాణం నిర్వహిస్తారు. 18న భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. 19న మొక్కులు చెల్లించుకుంటారు. 20న జాతర ముగుస్తుంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ లైట్లు, దుకాణాల కోసం స్థలం కేటాయింపు లాంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతరకు వెళ్లేందుకు ఇల్లెందు- నిజాంపేట మధ్య లచ్చగూడెం క్రాస్ ముందు నుంచి రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్ నిర్మించారు. గతంలో కంకర రోడ్డు ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

వందల ఏళ్ల చరిత్ర..



కోటిలింగాల ఆలయంలో మా తాత, ముత్తాల కాలం నుంచి పురోహితులుగా పనిచేస్తున్నాం. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. భక్తులు నమ్మకాలను పదిలపర్చుకుంటూ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఆలయానికి పేరుప్రఖ్యాతులు ఉన్నాయి.

–విజయశర్మ, పూజారి, కోటిలింగాల ఆలయం, ఇల్లెందు

కోరిన కోరికలు తీరుతాయి



మేము ఏటా వచ్చి ప్రత్యేక పూజలు చేస్తాం. ఇక్కడికి వస్తే అంతా మంచే జరుగుతుంది. కోరిన కోరికలు తీరుతాయి. బేతంపూడి గ్రామం నుంచి ఆటో ద్వారా కొంత మందితో వచ్చి పూజలు చేసి వెళ్తుంటారు. శివపార్వతులు అంటే మాకు ఎంతో ఇష్టం. ఇక్కడికి వస్తే మనసుకు ఉల్లాసంగా ఉంటుంది.

– ఈర్ల సత్యనారాయణ, భక్తుడు, బేతంపూడి గ్రామం

కాకతీయుల కాలంనాటి..



కాకతీయుల నాటి శివలింగం

జూలూరుపాడు: మహా శివరాత్రి పర్వదినానికి శివాలయాలు ముస్తాబవుతున్నా యి. పాపకొల్లు శ్రీ ఉమాసోమ లింగేశ్వరాలయం, గాంధీనగర్ శ్రీ ఉమామహేశ్వరి సమేత హిమ చంద్ర శేఖర స్వామి, భేతాళపాడు శ్రీసోమన్న స్వామి ఆలయాల్లో ఈ నెల 18న శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. శివలింగాలకు అభిషేకం, విఘ్నేశ్వర పూజ, కుంకుమార్చన, రుద్రహోమం వంటి పూజలు జరుపనున్నారు. పాపకొల్లు శ్రీఉమాసోమలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో కాకతీయుల కాలం నాటి మహా శివలింగం ఉంది. శివరాత్రితో పాటు కార్తీక మాసంలోనూ ఇక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. శివాలయం ప్రాంగణంలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం, సుబ్రమణ్యస్వామి విగ్రహం, నవగ్రహాలు ఉన్నాయి. గాంధీనగర్ రాతిగుట్టపై స్వయంభూ శివ లింగంతోపాటు, శివపార్వతుల విగ్రహాలు, కాట(కోట)మైసమ్మ తల్లి, శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు, శ్రీసుబ్రహ్మణ్యస్వామి దేవతా విగ్రహాలు ఏడేళ్ల క్రితం లభ్యమయ్యాయి. నాటి నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు, శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన శివభక్తుడు భూక్యా రాందాస్ ఆధ్వర్యంలో మార్చి 8, 2016 సంవత్సరంలో దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి దేవతా విగ్రహాలకు నిత్య పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నారు. మహా అద్భుత శివలింగం, దేవతామూర్తులు భక్తులచే విశేష పూజలు అందుకుంటున్నారు. మహాశివరాత్రికి, కార్తీక మాసంలో నాగుల చవితి, కార్తీక పౌర్ణమి, శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల సమయంలో రాతిగుట్టపై ఉన్న మహా శివలింగాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజ లు చేస్తుంటారు. రాతిగుట్టపై ఉన్న మహాశివ లింగాన్ని భక్తులు దర్శించుకోవాలంటే గాంధీనగర్ గ్రామం నుంచి సుమారు 1.5 కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది.



శ్రీఉమాసోమలింగేశ్వరాలయం

శుభం కలుగుతుంది..



శ్రీ ఉమాసోమలింగేశ్వర స్వామివారిని మహాశివరాత్రి రోజు దర్శించుకుని, అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు చేస్తే శుభం కలుగుతుంది. కోరిన కోరికలు నెరవేరుతాయి. పండుగ రోజు తెల్లవారు జామున 4 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయి. బిల్వదళాలు(మారేడు దళాలు) అర్చన, పంచామృతాలతోపాటు, విభూదితో అభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తారు.

–తెవికిచర్ల మధుకుమార్ శర్మ, అర్చకుడు, పాపకొల్లు

ప్రాచీన శైవక్షేత్రం..



సుజాతనగర్‌లోని శివాలయం

సుజాతనగర్: సుమారు 500 సంవత్సరాల చరిత్ర గలిగిన సుజాతనగర్‌లోని స్వయంభూ శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం అతి ప్రాచీన శైవ క్షేత్రంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రధాన కాశీ ఆలయానికి ఉత్తరం వైపున ఓ నది ఎలా ప్రవహిస్తూ ఉంటుందో... అచ్చం అలాగే ఈ ఆలయానికి ఉత్తర దిశలో ప్రవహించే నది (వాగు) ఉండటం విశేషం. గతంలో సిరిపురం అనే పేరుతో పిలువబడిన ఈ ఆలయం ప్రస్తుతం సుజాతనగర్ శివాలయం భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. మండలవాసులతోపాటు కొత్తగూడెం, చండ్రుగొండ, ఏన్కూరు, జూలూరుపాడు, తల్లాడ తదితర మండలాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని రెండు రోజులపాటు పూజలు జరుగుతాయి. సుమారు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం క్యూలైన్లు, స్నానాల గదులు, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

సూర్యకిరణాలు నేరుగా..



ఆత్మలింగేశ్వరాలయం

పాల్వంచ: పాల్వంచలోని చింతలచెర్వు పక్కన ఉన్న శ్రీ ఆత్మలింగేశ్వరాలయం కాకతీయు కాలంలో 1324 సంవత్సరంలో నిర్మించినట్లు చరిత్ర కారులు చెబుతుంటారు. ఈ ఆలయంలో శివరాత్రికి రెండు వారాలు, దసరా పండుగకు రెండు వారాలు సూర్యకిరణాలు నేరుగా ఆలయంలోని శివలింగంపై పడతాయి. ఈ సమయంలో స్వామి వారిని దర్శించుకుంటే కోటి లింగాలను దర్శించిన, పూజించిన ఫలితం వస్తుందని భక్తులు విశ్వసిస్తారు. ఆలయంలో ఈ నెల 18న శివ లీలా కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి పూజాది కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు తెలిపారు. దమ్మపేట క్రాస్ రోడ్‌లోని శ్రీగంగా పార్వతి సమేత సోమలింగేశ్వర స్వామి ఆలయం, గట్టాయిగూడెంలోని సాంబసదా శివాలయం, వనమా కాలనీలోని శివాలయాలు శివరాత్రికి ముస్తాబవుతున్నాయి.

కార్యకర్తలను కాపాడుకుంటా..

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి



సారపాకలో క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి

బూర్గంపాడు: తనవెంట నడుస్తున్న కార్యకర్తలను, అనుచరులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా తగ్గేదేలేదని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సారపాకలో గురువారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కష్టనష్టాల్లో తనకు తోడుగా నిలిచిన అభిమానులకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులున్నా అండదండగా ఉంటానని పేర్కొన్నారు. కొద్దిరోజులపాటు అభిమానులు ఇబ్బందులు పడినా రానున్న రోజుల్లో బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. 2014లో పినపాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పాయం వెంకటేశ్వర్లును ఎమ్మెల్యేగా గెలిపించారని, రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కూడా పాయంను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తొలుత ఆయన మోరంపల్లిబంజర, లక్ష్మీపురం గ్రామాలలో పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, అశ్వాపురం ఎంపీపీ సుజాత, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్.విజయమ్మకు ఘనస్వాగతం

- పాలేరు నియోజకవర్గ కార్యాలయ ప్రారంభోత్సవం
- షర్మిలమ్మను ఆదరించాలని పిలుపు



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న విజయమ్మ

ఖమ్మంరూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్.విజయమ్మకు వైఎస్సార్ టీపీ పాలేరు నియోజకవర్గ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఖమ్మం రూరల్ మండలం సాయిగణేష్ నగర్‌లో ఏర్పాటుచేసిన వైఎస్సార్‌టీపీ పాలేరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. తొలుత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించాక పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నేతలు భారీ ఎత్తున తరలివచ్చి షర్మిలమ్మ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులను ఉద్దేశించి విజయమ్మ మాట్లాడుతూ వైఎస్ కుటుంబాన్ని మొదటి నుంచి ఖమ్మం జిల్లా ఆదరిస్తోందన్నారు. ఈ జిల్లాతో తమకు అవినాభావ సంబంధం ఉందని.. షర్మిలమ్మ ఓదార్పుయాత్ర, రెండుసార్లు పాదయాత్ర ఇక్కడి నుంచే జరిగాయని గుర్తు చేశారు. పార్టీ ప్రకటన, పాలేరు నుంచి పోటీ చేయాలనే నిర్ణయం వెనుక దేవుడి ప్రణాళిక, దైవేచ్ఛ ఉందని నమ్ముతున్నట్లు ఆమె చెప్పారు. పాలేరు నియోజకవర్గ ప్రజలు షర్మిలమ్మకు గట్టి పునాదిని ఇచ్చి ఆదరించాలని కోరారు. అలాగే ఎప్పుడూ, ఎవరూ చూడని మెజార్టీ ఇచ్చి ఆమెను గెలిపించాలని విజయమ్మ పిలుపునిచ్చారు. అనంతరం నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతో ఆమె కొద్దిసేపు సమావేశమై పాలేరులో షర్మిలమ్మ పోటీ చేయనున్నందున నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి గట్టు రామచంద్రరావు, రాష్ట్ర కోఆర్డినేటర్ వాడుక రాజగోపాల్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడిపల్లి కవిత, జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబుతో పాటు పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, నంద్యాల రవీందర్‌రెడ్డి, తుంపాల కృష్ణమోహన్, జల్లేపల్లి సైదులు, ఆలస్యం రవి, రాంబాబు, యండపల్లి వెంకయ్య, వాలూరి సత్యనారాయణ, వై.వీ.డీ.రెడ్డి, రూప్లానాయక్, బత్తిని యాలాద్రి, లింగనబోయిన ఉమ, మస్తాన్ సాహెబ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెం–మాచినేనిపేటతండా గ్రామాల మధ్య తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన ఆపి ఉన్న బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుండాలకు చెందిన బాల్య కిరణ్, అతని స్నేహితుడు చేబోతు రవి కలిసి బైక్‌పై జూలూరుపాడు నుంచి కొత్తగూడెం వెళుతున్నారు. కొమ్ముగూడెం గ్రామ సమీపంలోకి రాగానే రహదారి పక్కన బైక్‌ను ఆపారు. యూరిన్ పోయడానికి రవి పక్కకు వెళ్లగా కిరణ్ బైక్‌పై ఉన్నాడు. అదే సమయంలో ఖమ్మం వెళ్తున్న భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న వాహనాలను ఓవర్ టేక్ చేసే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న కిరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. బైక్ బస్సు ముందు భాగంలో ఇరుక్కుపోయింది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆర్టీసీ బస్సు, బైక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాద సంఘటనపై విచారణ చేపట్టారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

దమ్మపేట: భారీ పైపులతో వెళ్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటన మండల పరిధిలోని సుధాపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండల పరిధిలోని ఆర్లపెంట గ్రామం వైపు నుంచి ఇందిరా సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పాత పైపుల లోడ్‌తో లారీ సత్తుపల్లి వైపునకు వెళ్తోంది. ఈ క్రమంలో సుధాపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో స్తంభం విరిగిపోగా, స్థానికుల సమాచారంతో విద్యుత్ శాఖ అధికారులకు కరెంట్ సరఫరా నిలిపివేశారు.

ఆరు నెలల జైలు శిక్ష

భద్రాచలంటౌన్: చెక్కు బౌన్స్ కేసులో గురువారం ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. వివరాలు ఇలా.. బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన భాస్కనూరి రామకృష్ణ తన అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన తిరునాగిరి భాస్కరసూరి వద్ద రూ.6.5 లక్షలు అప్పు తీసుకొని ఖాళీ చెక్కును హామీగా ఇచ్చాడు. కాగా రామకృష్ణ అప్పు సకాలంలో చెల్లించలేదు. దీంతో భాస్కర సూరి చెక్కును బ్యాంక్‌లో డిపాజిట్ చేయగా బౌన్స్ కావడంతో 2017లో భద్రాచలం కోర్టును ఆశ్రయించాడు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలు పరిశీలించి రామకృష్ణకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు నెలలలోపు తీసుకున్న అప్పు చెల్లించకపోతే మరో మూడు నెలలు శిక్ష పొడిగించనున్నట్లు తీర్పులో పేర్కొన్నారు.

లంపీ స్కిన్ వ్యాధితో ఆవు మృతి

అశ్వారావుపేట: లంపీ స్కిన్ వ్యాధి సోకి పశువు మృతి చెందిన సంఘటన దమ్మపేట మండలంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దమ్మపేటకు చెందిన చిన్నంశెట్టి సత్తిబాబుకు చెందిన ఆవుకు లంపీ స్కిన్ వ్యాధి సోకడంతో చనిపోయిందని పశువైద్యాధికారి మన్యం రమేష్ తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 10 పశువులకు వ్యాధి సోకిందని పేర్కొన్నారు. లంపీ స్కిన్ వ్యాధికి వైద్యం అందుబాటులో ఉందని, పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే యజమానులు తమను సంప్రదించాలని కోరారు. ఆవు మృతితో రూ.30 వేల నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు.

వివాహితను వేధిస్తున్న వారిపై కేసు

నేలకొండపల్లి: వివాహితను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్తతో పాటు అత్తమామలపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండలంలోని అనాసాగారానికి చెందిన జ్యోతితో ముజ్జుగూడెంకు చెందిన సంతోష్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం ఏర్పడగా 2020లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తామామలు వేధిస్తుండడమే కాక సంతోష్ ఇంకో వివాహం చేసుకునేందుకు యత్నిస్తున్నాడని జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా మామ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, భర్త తన వ్యక్తిగత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరిస్తున్నట్లు పేర్కొనగా ముగ్గురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రూ.10వేలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులకు చెందిన కుమ్మరికుంట్ల నాగయ్య ఖాతా నుండి సైబర్ నేరగాళ్లు రూ.10వేలు కొట్టేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 14న నాగయ్యకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఏటీఎం కార్డు గడువు తీరినందున, కొత్త కార్డు ఇచ్చేందుకు ఓటీపీ పంపిస్తున్నట్లు చెప్పాడు. ఆ మాటలు నమ్మిన నాగయ్య ఓటీపీ చెప్పగానే ఖాతా నుండి రూ.10వేలు డ్రా అయినట్లుగా సమాచారం వచ్చింది. దీంతో ఆయన గురువారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

12 అడుగుల జొన్న..

బంగ్రుగొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ పద్మ ఇంట్లో పచ్చ జొన్న చెట్టు 12 అడుగుల మేర పెరిగింది. 60 రోజుల క్రితం నాటానని, భారీగా పెరగడంతో పాటు 7 కంకులు కాసిందని సర్పంచ్ తెలిపారు.

– పాల్వంచరూరల్



జొన్న చెట్టు వద్ద సర్పంచ్ పద్మ

క్లుప్తంగా...


కల్వకుర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనం తిని పదిమందికి అస్వస్థత

- వాంతులు, విరేచనాలతో ఐదుగురు విద్యార్థులు ఆస్పత్రిలో చేరిక

కల్వకుర్తి రూరల్: పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనం తిని 10 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. పాఠశాలలో గురువారం వండిన భోజనం సరిగ్గా ఉడకకపోవడంతో పాటు వాసన వచ్చింది. దీంతో భోజనం తిన్న విద్యార్థుల్లో 10 మంది వాంతులు చేసుకోవడంతో పాటు తలనొప్పితో బాధపడ్డారు. వీరిలో ఐదుగురు రాకేష్, గణేష్, సురేందర్, యశ్వంత్, సూర్యతేజలకు వాంతులు ఎక్కువ కావడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. కొన్నిరోజులుగా మహిళలకు బదులుగా వారి భర్తలు మధ్యాహ్న భోజనం వండుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. హెచ్‌ఎం కస్నానాయక్ ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

తల్వార్‌తో కేక్ కట్‌చేసిన మంత్రి



నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బర్త్‌డే వేడుకలకు ఓ నేత తల్వార్‌తో వచ్చారు. మంత్రికి తల్వార్‌ను ఇచ్చి కేక్ కట్ చేయాలని చెప్పారు. దీంతో ఇంద్రకరణ్‌రెడ్డి తల్వార్‌తో కేక్ కట్‌చేసి నేతలకు తినిపించారు. ఈ వేడుకలకు నిజామాబాద్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, నిజామాబాద్ మున్సిపల్ మేయర్, వారి అనుచరులు వచ్చారు. తల్వార్ పోలీసుల అనుమతితోనే క్యాంపు కార్యాలయంలోకి వచ్చిందా లేక పోలీసుల కళ్లుగప్పి తెచ్చారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్


వేములవాడ: మహాశివరాత్రి సందర్భంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని విద్యుత్ లైట్లతో ముస్తాబు చేశారు. నేటి నుంచి ఆలయంలో శివరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి.

పురుగు మందు మితిమీరుతోంది!

▶ మొదటి పేజీ తరువాయి



అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదని ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు ఓ సమావేశంలో అభిప్రాయపడ్డారు. సహజసిద్ధమైన విధానాలు అవలంబిస్తే భూసారాన్ని పరిరక్షించవచ్చని, సాగు ఖర్చు తగ్గుతుందని, ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడి పెరుగుతుందనేది అపోహ..

వ్యవసాయంలో రసాయన మందుల వినియోగం పెంచడం వల్ల దిగుబడి పెరుగుతుందనేది ఒక అపోహ మాత్రమే. ఒక్కోసారి సీజన్‌లోని వాతావరణ పరిస్థితులతో దిగుబడి పెరిగినా.. క్రిమిసంహారకాల వినియోగం పెంచడంతో క్రమంగా దిగుబడి తగ్గుతుంది. ఇటీవలి కాలంలో రైతులు తరచుగా జ్వరం, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలకు గురవుతున్నారు. పొలాల్లో పురుగుమందులు పిచికారీ చేసేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా గాలిద్వారా రసాయనాలు కొంతమేరకు శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీనివల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. శరీరంపై పడిన రసాయనాల వల్ల చర్మ సంబంధిత వ్యాధులు బాధిస్తాయి. పలు అంతర్జాతీయ సంస్థలు ఈ అంశాలపై పరిశోధనలు జరిపి ధ్రువీకరించాయి. మరోవైపు రసాయనాలతో కూడిన మందుల వినియోగంతో భూసారం తగ్గితే, ఎరువుల వాడకాన్ని కూడా పెంచాల్సి వస్తుంది. ఇది రైతుకు అదనపు భారంగా మారుతుంది. అందువల్ల సహజసిద్ధమైన పద్ధతుల్లో సాగు చేయడమే మేలు. దిగుబడి ఒకేసారి పెరగనప్పటికీ, భవిష్యత్తులో లాభదాయకంగా ఉంటుంది.

– నర్సింహారెడ్డి, వ్యవసాయ రంగ నిపుణులు

క్రిమిసంహారకాలు అత్యధికంగా వినియోగిస్తున్న రాష్ట్రాలు (మె. టన్నుల్లో)

రాష్ట్రం	2017-18	2018-19	2019-20	2020-21
మహారాష్ట్ర	15,568	11,746	12,783	13,243
ఉత్తర్‌ప్రదేశ్	10,824	11,049	12,217	11,557
పంజాబ్	5,835	5,543	4,995	5,193
తెలంగాణ	4,866	4,894	4,915	4,986
హరియాణా	4,025	4,015	4,200	4,050
జాతీయ స్థాయి	63,406	59,670	61,702	62,193

ఒక్క డాక్యుమెంట్ రూ.15.96 కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చే మిస్కిపేటలో 1,54,880 చదరపు గజాల భూమిని ఓ ఆయిల్ కార్పొరేషన్, ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కలిసి మరో రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించాయి. ఈ భూమి మార్కెట్ విలువ రూ.466 కోట్లుగా నిర్ధారించిన రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు 35.51 కోట్ల ఫీజు వసూలు చేశారు. గండిపేట, రాజేంద్రనగర్, వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనూ పలు భారీ లావాదేవీలు, 5 డాక్యుమెంట్ల ద్వారా రూ.100 కోట్ల రెవెన్యూ వచ్చిందని అధికారవర్గాలు తెలిపాయి.

రూ.14,500 కోట్లదాకా ఆదాయం!

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని పరిశీలిస్తే.. ఫిబ్రవరి 13 నాటికి రూ.12,310 కోట్ల వరకు ఖజానాకు చేరినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మరో నెలన్నర రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో.. ఇంకో రూ.2,000 కోట్ల నుంచి రూ.2,200 కోట్ల వరకు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రభుత్వం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల్లో పేర్కొన్న విధంగా రూ.16 వేల కోట్లు, 2023–24కు నిర్దేశించుకున్న రూ.18 వేల కోట్లు సమకూరే అవకాశం లేదని.. రిజిస్ట్రేషన్ ఫీజులు లేదా భూముల విలువలను సవరిస్తేనే లక్ష్యం చేరుకోవడం సాధ్యమని అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లన్నీ కలిపి రూ.14,500 కోట్ల మేరకు సమకూరవచ్చని అంటున్నారు.

2022-23లో భారీగా ఫీజు వచ్చిన రిజిస్ట్రేషన్ లావాదేవీలు (రూ.కోట్లలో)

నెల	రిజిస్ట్రార్ ఆఫీసు	రెవెన్యూ
మే (2022)	కూకట్‌పల్లి	35.51
ఏప్రిల్ (2022)	గండిపేట	21.72
ఆగస్టు (2022)	గండిపేట	16.21
జనవరి (2023)	గండిపేట	15.96
అక్టోబర్ (2022)	రాజేంద్రనగర్	15.08
ఏప్రిల్ (2022)	వనస్థలిపురం	14.43
సెప్టెంబర్(2022)	కూకట్‌పల్లి	13.58

వైద్యసేవల్లో తెలంగాణ ఫస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

ఇస్తే సంతోషపడాల్సిందిపోయి బాధపడుతున్నాడని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు అవకాశం లేక, ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తే ఒకరు కుట్ర అంటున్నారని, అంబేడ్కర్ పేరు మీద సచివాలయం నిర్మిస్తే ఇంకొకరు కూలుస్తం అంటున్నారని మండిపడ్డారు. పేల్చేటోని చేతికో.. కూల్చేటోని చేతికోపోతే తెలంగాణ ఆగం అవుతుందన్నారు. వచ్చే నెల మొదటి వారంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో న్యూట్రిషన్ కేసీఆర్ కిట్లను ప్రారంభించనున్నామని, ఏప్రిల్ మొదటి వారంలో 33 జిల్లాల్లో ప్రారంభించనున్నామని తెలిపారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుండటంతో మహారాష్ట్ర, కర్ణాటక సర్పంచులు.. తమను తెలంగాణాలో కలపాలని వినతులు ఇస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా వార్త వచ్చిందని బీబీసీ మీద ఐటీ దాడులు చేయించడాన్ని చూసి ప్రజలు నవ్వుతున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, నల్లగొండ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు

నలుగురు మహిళలు దుర్మరణం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- మృతులు.. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో పనిచేసే కార్మికులు
- ప్రమాదానికి కారణమైన బస్సు కూడా కంపెనీదే..


ఆటోను ఢీకొట్టిన బస్సు


అనసూయ(ఫైల్)


నాగలక్ష్మీ(ఫైల్)


శిరీష (ఫైల్)


ధనలక్ష్మీ(ఫైల్)

చౌటుప్పల్: ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి నాలుగు నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. సరైన సమయంలో బ్రేకులు పడకపోవడంతో జరిగిన ప్రమాదంలో నిరుపేద కుటుంబాలకు చెందిన నలుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో గురువారం చోటుచేసుకుంది. ఇండస్ట్రియల్ పార్కులో శ్వేత తెలుగు ఫుడ్స్ (పచ్చళ్ల కంపెనీ)లో వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పనిచేస్తున్నారు. దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రోజూ మాదిరిగానే ఉదయం 8.30కి ఆటోలో కంపెనీకి బయలుదేరారు. ఇదే కంపెనీలో పనిచేసేందుకు రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి కార్మికులు కంపెనీకి చెందిన అద్దె బస్సుల్లో వస్తారు. ఆ క్రమంలో కార్మికులతో వస్తున్న బస్సు ఇండస్ట్రియల్ పార్కు తూర్పు వైపున ఉన్న రోడ్డులో వస్తోంది. బస్సు వస్తున్న రోడ్డు ఏటవాలుగా ఉండడంతో డ్రైవర్ బస్సు గేరును న్యూట్రల్ చేశాడు. సరిగ్గా అదే సమయంలో మహిళా కార్మికులతో వస్తున్న ఆటో కంపెనీలోకి వెళ్లేందుకు కుడివైపునకు తిరుగుతుండగా బస్సు బలంగా వచ్చి ఢీకొట్టింది. బస్సును ఆపేందుకు దాని డ్రైవర్ ప్రయత్నించినప్పటికీ గేరు న్యూట్రల్‌లో ఉన్న కారణంగా ఆగకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డాకోజి నాగలక్ష్మి(28), వరకాంతం అనసూయ(55), సిలివేరు ధనలక్ష్మి(35), దేవరపల్లి శిరీష(30) మృతిచెందారు. ఆటోడ్రైవర్ కొండ వెంకటేష్ తో పాటు మరో ముగ్గురు మహిళలు చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. నలుగురు మృతి చెందడంతో దేవలమ్మనాగారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల పిల్లలు, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని గ్రామస్తులు పచ్చళ్ల కంపెనీ ముందు ఆందోళనకు దిగారు. శిరీష మృతదేహాన్ని కంపెనీ ముందు ఉంచి ఆందోళన చేశారు.

అదృశ్యమై... ఆపై శవాలై

- ప్రేమికుల దినోత్సవం ముందు రోజే వెళ్లారు..
- మరణంలో సైతం ఒక్కటేనన్నట్టు చేతులు కట్టుకొని చెరువులో దూకారు


కల్పన (ఫైల్)


ఖదీర్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మూడు రోజులుగా కనిపించకుండా పోయిన ఆ జంట అదృశ్యం మిస్టరీ విషాదాంతమైంది. వారి మృతదేహాలు గురువారం నార్సింగిని ఆనుకునే ఉన్న క్యాసంపల్లి చెరువులో లభ్యమయ్యాయి. మరణంలోనూ తమను విడదీయలేరనే భావంతో వివాహిత చున్నీతో ఇద్దరూ తమ చేతులను కట్టుకొని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన తోట సిద్ధరాములు చిన్న కూతురు తోట కల్పన (18) పదో తరగతి వరకు చదివి ఇంటివద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఖలీల్ (19) కల్పన పెద్దనాన్న వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న క్రమంలో వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఈ క్రమంలో పలుమార్లు గొడవలు జరగగా ఖలీల్‌ను పనిలోంచి తీసేశారు. మూడు నెలల క్రితం కల్పన వివాహం కామారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన వ్యక్తితో జరిగింది. పెళ్లయినా ఖలీల్‌తో సాన్నిహిత్యం కొనసాగేది. కల్పన గత సోమవారం పుట్టింటికి వచ్చింది. కల్పన అదేరోజు రాత్రి బస్సులో రామాయంపేటకు రాగా, ఖలీల్ బైక్‌పై వచ్చాడు. ఇద్దరూ కలిసి నార్సింగికి చేరుకున్నారు. చెరువువద్ద బైక్‌తోపాటు చెప్పులు విడిచి కల్పన చున్నీతో ఇద్దరి చేతులు కట్టుకొని నీటిలో దూకినట్టు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం ఇద్దరి మృతదేహాలు నీటిలో తేలగా, చూసిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరి మృతదేహాలను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జాబ్‌మేళాలతో గిరిజనులకు జీవనోపాధి


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యాన నిర్వహించే జాబ్‌మేళాలతో గిరిజన యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీడీఏ భవిత విభాగం జేడీఎం హరికృష్ణ తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో వివిధ ప్రైవేట్ కంపెనీల్లో నియామకాల కోసం గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 150 మంది హాజరుకాగా ఇంటర్వ్యూల అనంతరం 84 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జేడీఎం హరికృష్ణ మాట్లాడుతూ గిరిజన యువతకు విద్యావకాశాలతో పాటు జీవనోపాధి కల్పించేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 84మందికి ఒకేరోజు ఉద్యోగావకాశాలు లభించగా, త్వరలోనే నియామక ఉత్తర్వులు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఉద్యోగులు స్వరూప, సమ్మయ్య, పాపారావు, కంపెనీల ప్రతినిధులు పవన్, గోపి, మనోజ్, అనిల్, సుబ్రహ్మణ్యం, శ్రీరాం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపికలు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపికలు చేపట్టనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. కిన్నెరసాని(బాలురు), కాచినేనపల్లి (బాలికలు)తో పాటు హైదరాబాద్ బోయినపల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లా విద్యార్థినీ, విద్యార్థులకు కిన్నెరసానిలో, ఖమ్మం జిల్లా విద్యార్థులకు ఉసిరికాయలపల్లి గిరిజన ఆశ్రమ హైస్కూల్‌లో ఈనెల 25నుంచి 28 తేదీ వరకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 31 ఆగస్టు 2023 నాటికి 9 నుండి 11 ఏళ్ల వయస్సు కలిగిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మార్చిలో తుది ఎంపికలు నిర్వహించి ఐదో తరగతిలో ప్రవేశం కల్పిస్తామని పీఓ వివరించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు వివరాల కోసం ఐటీడీఏలోని డీడీ, స్పోర్ట్స్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా వార్తలు

గోళ్లపాడు అందాలు అదరహో!


పార్కులో లాన్, కూర్చునేందుకు బెంచీలు



ఓపెన్ జిమ్



వైకుంఠపాళి పటం

ఖమ్మం జిల్లా కేంద్రంలోని గోళ్లపాడు చానల్‌పై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన రూపొందించిన పార్కులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. పచ్చదనంతోపాటు పార్కుల్లో స్థానికులు సరదాగా గడిపేందుకు, ఆడుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అలాగే, ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటుచేయగా ఉదయం, సాయంత్రం పిల్లలతో పాటు వ్యాయామం చేసేందుకు వస్తున్న వారితో సందడి నెలకొంటోంది. ఇక సేదతీరేందుకు బెంచీలు, ఆడుకునేందుకు స్కేటింగ్ రింక్, చదరంగం, వైకుంఠపాళి వంటి ఏర్పాట్లు కూడా ఉండడం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది.

– ఖమ్మం మయూరిసెంటర్

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

మానుకోట జిల్లా జడ్జి పాటిల్ వసంత్


పరీక్ష చేయించుకుంటున్న జడ్జి పాటిల్ వసంత్

మహబూబాబాద్ రూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సూచించారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులు, జర్నలిస్టులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి వసంత్ కంటి పరీక్షలు చేయించుకున్నాక మాట్లాడారు. సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్, అధికారులు, న్యాయవాదులు అంబరీష్, వెంకటయ్య, రవికుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రాచరిక పాలన'


సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

పెద్దవంగర: రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతోందని బీజేపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమయ్య ఆరోపించారు. పెద్దవంగర మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ప్రజాగోస– బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ సాయిని రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాంచందర్‌రావు, సోమయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు రంగు రాములు, బొమ్మెర బోయిన సుధాకర్, ఝాన్సీ, తలారి సోమయ్య, గడపురం భిక్షపతి, జలగం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'తెర' మరుగు!


థియేటర్ వద్ద స్థానికులు

మధిర: ఖమ్మం జిల్లా మధిరలోని వాసవీ థియేటర్ ఇక జ్ఞాపకంగా మిగిలిపోనుంది. 1981 జనవరిలో వాసవి థియేటర్‌ను ప్రారంభించగా, కృష్ణంరాజు నటించిన బెబ్బులి సినిమా మొదటగా ప్రదర్శించారు. ఇలా 42 ఏళ్ల పాటు ప్రేక్షకులను అలరించిన ఈ థియేటర్ స్థలాన్ని రిలయన్స్ సంస్థ లీజ్‌కు తీసుకుంది. భవనాన్ని నేలమట్టం చేసి నూతనంగా మాల్ నిర్మించనుండగా.. గురువారం అమిగోస్ చిత్రప్రదర్శనతో థియేటర్‌ను మూసేశారు. కాగా, లడక బజారుకు చెందిన చెరుపల్లి శ్రీధర్, రావిరాల శశికుమార్ తదితరులు 1981లో మొదటి సినిమాను, గురువారం చివరి సినిమా చూడడంతో పాటు ఫొటోలు దిగి జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా ధూప, దీప నివేదన పథకంలోని ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నివేదన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునగలేటి రమేష్ శర్మ, మరిగంటి భార్గవాచార్యులు తెలిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు ఆయుష్య హోమాలు, నవగ్రహ జప హోమాలు, మహా మృత్యుంజయ పాశుపత రుద్రహోమాలు నిర్వహించాలని రాష్ట్ర ధూప దీప నివేదన అర్చక సంఘం రాష్ట్ర కమిటీ తీర్మానించిందని పేర్కొన్నారు. ఈమేరకు అర్చకులు పూజలు చేయాలని కోరారు.

104 వాహనాల ఈ - వేలం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లాలోని 104 వాహనాలను ఈ– వేలం ద్వారా విక్రయించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. 2008 మోడల్ స్వరాజ్ మజ్దా కంపెనీకి చెందిన 11 వాహనాలు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22న సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లో వేలం ఉంటుందని తెలిపారు. ఒక్కో వాహనం ప్రారంభ ధర రూ.3.50లక్షలుగా నిర్ణయించామని, అదనంగా 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాల కోసంజిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీఈడీలో వంద శాతం ఉత్తీర్ణత

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని బీఈడీ కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కాకతీయ యూనివర్సిటీ అధికారులు బీఈడీ ద్వితీయ సంవత్సరం ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈమేరకు కళాశాల నుంచి పరీక్షలు రాసిన 90 మంది ఉత్తీర్ణులయ్యారని అధికారులు వెల్లడించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లలిత కుమారి, ఉద్యోగులను ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, డీడీ రమాదేవి అభినందించారు.

కేవీని సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని కేంద్రియ విద్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా గురువారం సందర్శించారు. ఈసందర్భంగా తరగతి గదులు, వసతిగృహాలు, బోధనా తీరును ఆమె పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అలాగే, ఉపాధ్యాయులతో సమావేశమై ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇస్లాంఖాన్, ఎంఈఓ శాంసన్, ఏఎంఓ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కొనసాగిన 'న్యాక్' పరిశీలన


అధ్యాపకులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) త్రిసభ్య బృందం పరిశీలన రెండో రోజైన గురువారం కూడా కొనసాగాయి. ఈసందర్భంగా జేకేసీ, ల్యాంగ్వేజ్ ల్యాబ్, వర్చువల్ క్లాస్‌రూం, డిజిటల్ క్లాస్‌రూం, లైబ్రరీ, వ్యాయామశాల, క్రీడా మైదానం, బొటానికల్ గార్డెన్ తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం రికార్డులు, తరగతి గదిలో అధ్యాపకుల బోధనా తీరును పరిశీలించి పలువురు అధ్యాపకుల పరిశోధనా వివరాలు తెలుసుకున్నారు. ఆతర్వాత తనిఖీ బృందం కన్వీనర్ ఎం.కృష్ణన్ మాట్లాడుతూ కళాశాలలో సదుపాయాలు బాగున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్ నిర్మాణానికి పునాదాలు వేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, రైతుబంధు రాష్ట్ర సలహాదారుడు పులిగళ్ల మాధవరావు, పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్రై శ్రీనివాస్, అర్వపల్లి రాధాకృష్ణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ త్రోబాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులతో తోపుదు బండి ఫౌండేషన్ బాధ్యుడు సాదిక్

కల్లూరు రూరల్: సౌత్‌జోన్ త్రోబాల్ పోటీలకు కల్లూరు క్రీడాకారులు ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జరగనున్న ఈ పోటీలకు సురుగు గోపి, కొసనం కార్తీక్ ఎంపికయ్యారని త్రోబాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్మోహన్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా క్రీడాకారులతోపాటు పీఈటీలు లక్ష్మీనర్సయ్య, వీరరాఘవయ్య, జయరావు, విజయకుమారి, సత్యనారాయణరెడ్డిని హెచ్‌ఎం మాధవరావు, తోపుదుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు సాదిక్ తదితరులు గురువారం అభినందించారు.